
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

గురువారం 26 డిసెంబరు 2024



బైబిలు పఠనం...



ప్రభువును కీర్తిస్తూ..

అనంతపురం: సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్రిస్మస్ సందడి

జిల్లా వ్యాప్తంగా వేడుకలు



లోక రక్షకా.. చల్లగా చూడు..



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న ప్రొఫెసర్ రెవరెండ్ శామ్యూల్ రాజశేఖర్






దేవా.. మా ప్రార్థన ఆలకించయ్యా...

క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చిలలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది తరలిరావడంతో ప్రార్థనా మందిరాల వద్ద సందడి కనిపించింది. అనంతపురం సప్తగిరి సర్కిల్‌లోని ఎస్‌ఐయూ టౌన్ కాంగ్రిగేషనల్ చర్చి, అరవింద నగర్‌లోని సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చి, కోర్టు రోడ్డులోని గాస్పెల్ హాల్ తదితర చర్చిలను విశేషంగా అలంకరించారు. మ్యూజికల్ నైట్ పేరుతో సాయంత్రం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్వ మానవాళికి శాంతి సందేశం ఇచ్చిన ప్రభువు మార్గాన్ని అనుసరించాలని మత పెద్దలు బోధించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

భయం లేదు.. భక్తి లేదు..!



ఆలయ భూములు హాంఫట్

- జనార్దనపల్లిలో రూ.5 కోట్ల భూమి ఆక్రమణ
- పాల్తూరులో రూ.8 కోట్ల భూమి దొడ్డిదారిలో అర్చకులకు..
- వైసీపీ హయాంలో చక్రం తిప్పిన నాయకులు
- పోలీసులు, దేవదాయశాఖకు గ్రామస్థుల ఫిర్యాదు



డైక్లాట్‌లో ఈనాము భూమి (ఐడీ)గా ఉన్న దృశ్యం

ఆలయ మాన్యం భూములపై వైసీపీ నాయకులు కన్నేశారు. అధికారం చేతిలోకి రాగానే భయం.. భక్తి లేకుండా కాజేశారు. జీవోలను, పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని రూ.కోట్ల విలువైన ఆస్తులను సొంతం చేసుకున్నారు. వీరిలో కొందరు అర్చకులు ఉండటం గమనార్హం. విడపనకల్లు మండలం జనార్దనపల్లి, పాల్తూరు గ్రామాలలో స్వాములవారి ఆస్తులు పక్కదారి పట్టడంతో ఆ గ్రామాల ప్రజలు పోలీసులు, దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. జనార్దనపల్లి సర్వే నంబరు 141లోని 21.05 ఎకరాలు, పాల్తూరు సర్వే నంబరు 296లో 21 ఎకరాలు, 533 సర్వే నంబరులో 14 ఎకరాలు స్వాహా అయిందని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు.

- విడపనకల్లు, ఆంధ్రజ్యోతి

జనార్దనపల్లి ఆలయ భూమిలో కంది పంట వేసిన వైసీపీ నాయకులు





జనార్దనపల్లిలోని శ్రీరామస్వామి దేవాలయం

ఈనాం భూమి

వేల్పుమడుగు రెవెన్యూ పరిధిలోని జనార్దనపల్లిలో సర్వే నంబరు 141లో మొత్తం 42.80 ఎకరాల భూమి ఉంది. ఇందులో కాశీబొట్ల గుండూరావు తన భాగానికి వచ్చిన 21 ఎకరాల పైచిలుకు భూమిని నలుగురికి విక్రయించారు. మిగిలిన 21.05 ఎకరాలు నివర్తి శంకరయ్య, నివర్తి శేషమ్మ దంపతుల వాటా. వీరు 1935లో తమ భాగాన్ని పాండురంగ స్వామి, జనార్దన స్వామి, ఆంజనేయస్వామి, రాములవారి ఆలయాలకు ఈనాముగా ఇచ్చారు. ఈ భూమిని 1993-94 మధ్య నక్సలైట్లు స్వాధీనం చేసుకుని, వేల్పుమడుగు ఎస్సీలకు ఒక్కొక్కరికి 2 ఎకరాల ప్రకారం పంపిణీ చేశారు. కొంతకాలం గుత్త చెల్లించకుండా వారు సాగు చేసుకున్నారు. ఆ తరువాత గుత్త చెల్లించాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంత సాగు చేయడం మానేశారు. అప్పటి నుంచి గ్రామస్థులే ఆ భూమిని కౌలుకు ఇచ్చేవారు.

భూస్వాముల చేతికి...

మాన్యం భూమి కొంతకాలం తరువాత జనార్దనపల్లి, వేల్పుమడుగు గ్రామాల భూస్వాముల చేతుల్లోకి వెళ్లింది. వారి నుంచి గ్రామస్థులు విడిపించి, ఆలయాలకు కౌలు చెల్లించే రైతులకు ఇచ్చారు. రైతులు సరిగా కౌలు చెల్లించకపోవడంతో వారి నుంచి కూడా విడిపించారు. ఇలా చేతులు మారినా, 2018 వరకూ ఆ భూమి మాన్యం భూమిగానే (మిగులు భూమి) ఉంది. 2019 నుంచి కథ మారడం మొదలైంది. 2019 జూలైలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కరూర్ గుండూరావు వారసుల పేరిట భూమి బదిలీ అయింది. కరూర్ సాయిప్రసాద్, కరూర్ వెంకటశేషశర్మ, కరూర్ భానుప్రకాష్ పేరిట మార్చుకున్నారు. 2022లో వైసీపీ వర్గీయుడు పి.జయకుమార్ (నారాయణరెడ్డి కుమారుడు) అనే వ్యక్తికి విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. సర్వే నంబరు 141లో సగం భూమి కాశీబొట్ల గుండూరావుది. ఆయన అప్పట్లోనే విక్రయించారు. ఆయన పేరిట బురిడీ కొట్టించేందుకు కరూర్ గుండూరావు వారసుల పేరిట వ్యవహారం నడిపించినట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. విక్రయించిన మాన్యం భూమి కాశీబొట్ల గుండూరావు వాటా కాకపోయినా.. అడిగేవారు ఉండరని కథ నడిపారని భావిస్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు

మాన్యం భూమి అన్యాక్రాంతంపై జనార్దనపల్లి గ్రామస్థులు ఉరవకొండ సీఐ చిన్న గౌస్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కడప జిల్లా ప్రొద్దటూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన కరూర్ గుండూరావు కొడుకులకు తమ ప్రాంతంతో సంబంధమే లేదని, అయినా వజ్రకరూరు అని తప్పుగా చూపించి భూమిని విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.5 కోట్ల విలువైన భూమిని రక్షించాలని కోరారు

పాల్తూరులో పక్కదారి..

పాల్తూరు బసవేశ్వర, రామలింగేశ్వర ఆలయాలకు సర్వే నంబరు 296లో 21 ఎకరాలు, 533లో 14 ఎకరాల భూమి ఉంది. దీన్ని వైసీపీ హయాంలో నలుగురు అర్చకుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. వైసీపీ హయాంలో వచ్చిన జీవో 43-10ను అడ్డు పెట్టుకుని ఈ భూములను కాజేశారు. ఆ జీఓ ప్రకారం వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్న భూములను అర్చకులు స్వాధీనం చేసుకుని సాగు చేసుకోవచ్చు. కానీ ఈ 35 ఎకరాలు జీబీసీ ఆయకట్టు భూమి. ఎకరానికి ఏడాదికి రూ.60 వేల వరకూ కౌలు వస్తుంది. ఈ లెక్కన ఏడాది ఆదాయం రూ.21 లక్షలకు పైగా ఉంటుంది. అందులో సగం కౌలు వస్తుందని భావించినా జీవో వర్తించదు. ఈ భూముల విలువ రూ.8 కోట్లకుపైగా ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు.



పాల్తూరు ఆలయ భూమిలో సాగుచేసిన మిరప పంట

ఇక్కడ లేకున్నా..

విజయ్‌కుమార్ అనే అర్చకుడు బళ్లారిలో కాపురం ఉంటున్నారు. కానీ పాల్తూరులో ఉన్నట్లు రికార్డులు చేయించి, పాల్తూరు, ఉండబండ ఆలయాల్లో అర్చకుడిగా చూపించి వేతనాన్ని పొందుతున్నారు. పాల్తూరు ఆలయ భూమిని తన పేరిట రాయించుకున్నారు. మొత్తం నలుగురు అర్చకులు పాల్తూరు ఆలయ భూములను అక్రమంగా రాయించుకున్నారని గ్రామస్థులు దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారం క్రితం అధికారులు వచ్చి విచారించారు. అర్చకుల నుంచి ఆ భూమిని విడిపించాలని గ్రామస్థులు అధికారిని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకుల అండతో అక్రమంగా భూమిని తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అది ఈనాం భూమి..



జనార్దనపల్లి పాండురంగస్వామి ఆలయ భూమిని అమ్మడానికి, కనడానికి వీలు లేదు. డైక్లాట్‌లో ఐడీ (ఈనాం డ్రైల్యాండ్) అని ఉంది. దీన్ని ఎవరూ మార్చలేరు. ఈనాం భూములను కొనడం, అమ్మడం నేరం. సర్వే నంబరు 141లోని 21.05 ఎకరాల ఆలయ భూమి. దీన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

- సునీతాబాయి, తహసీల్దారు, విడపనకల్లు

ఏవి కావాలంటే అవి..!

- పాఠశాలలకు క్రీడా సామగ్రి
- విద్యార్థులకు ఎంచుకునే స్వేచ్ఛ
- రూ.7 వేల నుంచి రూ.30 వేల వరకూ..
- పాఠశాలల నుంచి విద్యాశాఖకు ఇండెంట్
- కూటమి ప్రభుత్వ విధానంపై హర్షాతిరేకాలు

కొనకొండ్ల జడ్పీ హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు



అనంతపురం విద్య, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు సరికొత్తగా క్రీడా సామగ్రిని అందనున్నాయి. గతంలో అన్ని పాఠశాలలకు ఒకే తరహా మెటీరియల్ ఇచ్చేవారు. పాలకులకు నచ్చినవే ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఎవరికి కావాల్సిన పరికరాలను వాళ్లే ఎంచుకునే స్వేచ్ఛను ఇచ్చింది. ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు అవసరమైన పరికరాల వివరాలతో ఇండెంట్ పంపితే.. ఆ మేరకు సరఫరా చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలకు రూ.7 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.14 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.30 వేల విలువైన పరికరాలను అందించనున్నారు. అన్ని పాఠశాలల నుంచి ఇండెంట్ తీసుకుంటున్నారు.

55 రకాల సామగ్రి

విద్యార్థులకు కొత్తగా 55 క్రీడాసామగ్రి ఇవ్వనున్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాక్సింగ్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, హాకీ, కబడ్డీ, రగ్బీ, రోప్ స్కిప్పింగ్, సాఫ్ట్ బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, వాలీబాల్ తదితర క్రీడలకు ఆటవస్తువులు, సామగ్రిని ఇస్తున్నారు. కనిష్ఠ ధర ధర రూ.90 నుంచి గరిష్ఠంగా రూ.12 వేల విలువైన వస్తువులకు జాబితాలో చోటు కల్పించారు. ఆర్చరీ ఆరోస్ రూ.90, ఆర్చరీ బౌ రూ.6000, ఆర్చరీ టార్గెట్ రూ.4500, అథ్లెటిక్స్ 50 మీటర్ల టేప్ రూ.850, బ్యాడ్మింటన్ కాక్స్ 120, బ్యాడ్మింటన్ నెట్ రూ.500, బ్యాడ్మింటన్ షెటిల్ రాకెట్లు రూ.1500, వాలీ బాల్ నెట్ రూ.1600, వాలీబాల్స్ రూ.1250, బాక్సింగ్ గ్లోవ్స్ రూ.850, క్యారంబోర్డు సెట్ రూ.650, చెస్‌సెట్ రూ.450, క్రికెట్ బ్యాట్స్ రూ.1500, ఫెన్సింగ్ గ్లోవ్స్ రూ.1000, ఫెన్సింగ్ మాక్స్ రూ.4 వేలు, హాకీ బాల్స్ రూ.120, హాకీ స్టిక్స్ రూ.650, రగ్బీ బాల్స్ రూ.900, టేబుల్ టెన్నిస్ టేబుల్ రూ.12,000 ఇలా.. విలువైన సామగ్రి ఇవ్వనున్నారు.

పాఠశాల స్థాయిని బట్టి..

కొత్త క్రీడాపాలసీ ప్రకారం పాఠశాల స్థాయినిబట్టి క్రీడాసామగ్రి అందించనున్నారు. విద్యార్థుల క్రీడా అవసరాలు, ఆసక్తి మేరకు పరికరాలు సరఫరా చేయాలని విద్యాశాఖకు పాఠశాలల నుంచి ఇండెంట్ పంపాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన బడ్జెట్ పరిమితికి మించకుండా తమకు కావాల్సిన క్రీడా వస్తువులను ఎంచుకోవచ్చు. 'సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యామిత్ర' యాప్ ద్వారా ఇప్పటికే పాఠశాలలనుంచి ఇండెంట్ పంపుతున్నారు. త్వరలోనే పరికరాలను సరఫరా చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

మంచి పరిణామం..



ప్రభుత్వం కొత్త క్రీడాపాలసీ అమలులో భాగంగా స్కూళ్లకు స్పోర్ట్స్ మెటీరియల్ అందించడం ఆనందంగా ఉంది. గతంలో వాళ్లు అనుకున్నవి ఇచ్చేవారు. కొత్త ప్రభుత్వం రూ.7 వేల నుంచి రూ.30 వేల వరకూ మెటీరియల్ ఇస్తోంది. విద్యార్థులు కోరిన క్రీడాసామగ్రి ఇవ్వడం శుభపరిణామం. దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడాసామగ్రి ఇస్తున్నారు.

- అక్కులప్ప, ఏపీపీఈటీ అండ్ ఎస్ఏపీఈ జిల్లా అధ్యక్షుడు

క్రీడల అభివృద్ధికి ఊతం..

పాఠశాల విద్యార్థులకు ఇకపై స్పోర్ట్స్ మెటీరియల్ కొరత ఉండదు. గతంలో ఈ సమస్య చాలా స్కూళ్లలో ఉండేది. పిల్లల కోసం కొందరు పీడీలు సొంత డబ్బుతో పరికరాలను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఇది మంచి ఆలోచన. పిల్లలు ఆటల వైపు మరింత ఆసక్తి చూపుతారు.

- అనిత, స్కూల్ అసిస్టెంట్ పీడీ, పూలకుర్తి జడ్పీ హైస్కూల్

ఎల్ఐసీపై జీఎస్టీ గురించి ప్రస్తావిస్తా

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ భారాన్ని ఎత్తివేసేలా పార్లమెంట్‌లో ప్రస్తావనని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. తనను కలిసిన అనంతపురం ఎల్ఐసీ బ్రాంచ్-2 ఏజెంట్ల సంఘం నాయకులకు ఆయన బుధవారం హామీ ఇచ్చారు. పాలసీదారులు, ఏజెంట్ల సమస్యలను జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చెరుకుతోట జగదీష్, కడప డివిజనల్ ప్రధాన కార్యదర్శి కదిరప్ప, హిందూపురం బ్రాంచ్ రమణారెడ్డి ఎంపీకి వివరించారు. దీంతో ఆయన స్పందించారు. రాష్ట్రం, కేంద్రంలోని కూటమి ప్రభుత్వాలు సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తున్నాయని అన్నారు. ఎల్ఐసీ పాలసీదారులు, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీని వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, అంజినప్ప, జయచంద్ర, త్రివిక్రమ్ పాల్గొన్నారు.

25 మందితో సీపీఎం జిల్లా కమిటీ



ఎన్నికైన సీపీఎం జిల్లా కమిటీ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా సీపీఎం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు 25 మందికి జిల్లా నూతన కమిటీలో చోటు దక్కింది. ఈనెల 23, 24వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా మహాసభల్లో భాగంగా జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికైన జిల్లా నూతన కమిటీని బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ వెల్లడించారు. సీపీఎం జిల్లా కమిటీ నూతన కార్యదర్శిగా నల్లప్ప, కార్యదర్శివర్గ సభ్యులుగా రాంభూపాల్, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావిత్రి, శ్రీనివాసులు, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులుగా ఆర్‌వీ నాయుడు, నాగమణి, రామాంజనేయులు, తరిమెల నాగరాజు, వెంకటనారాయణ, నిర్మల, అచ్యుతప్రసాద్, మల్లికార్జున, భాస్కర్, జగన్మోహన్‌రెడ్డి, మారుతీప్రసాద్, ముత్తుజా, ఓతూరు పరమేష్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, శకుంతల ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా కాలువ వెడల్పు, పంట కాల్వల నిర్మాణం, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఖనిజ వనరులు, ఉద్యాన పంటల ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. వృత్తుల రక్షణకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టి, వృత్తిదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. జిల్లా అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.5వేల కోట్లు కేటాయింపు కోసం పార్టీ స్వతంత్రంగా ఆందోళనలు చేపట్టడంతోపాటు కలిసొచ్చే శక్తులతో ఐక్య ఉద్యమాలు చేస్తుందని ప్రకటించారు.

న్యూస్‌బాక్స్

ఒకరోజు ముందుగానే...

31న పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు కొత్త సంవత్సరం ఒక రోజు ముందుగానే రానుంది. ఈనెల 31వ తేదీన 2025 సంవత్సరం జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఈనెల 30న బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసుకోవాలని సూచించారు.

జీసీపల్లిలో భారీ కొండచిలువ



పుట్లూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామశివారులోని కొండ ప్రాంతంలో బుధవారం భారీ కొండచిలువను చూసి జనం భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో పశువులను మేపేందుకు వెళ్లారు. అక్కడ మేక పిల్లలను చూసిన కొండచిలువ... వాటిని తినేందుకు ప్రయత్నించగా కాపరులు దానిని వెంబడించారు. దీంతో అరగంటపాటు శ్రమించి కట్టెలతో కొట్టి చంపేశారు. సుమారు 7 అడుగులు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

టమోటా కిలో రూ.11

అనంతపురం రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,320 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6,500, సరాసరి రూ. 19 వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 38 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్యపాఠశాల ఆవరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి తెలిపారు. 2008 జనవరి 1వతేదీ నుంచి 2011 డిసెంబరు 21వతేదీలోపు జన్మించిన బాల, బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28, 29వతేదీలలో కాకినాడలో నిర్వహించే 10వ ఏపీ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



హుస్సేనమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధురాలు హుస్సేనమ్మ(109) బుధవారం అనారోగ్యంతో మరణించారు. హుస్సేనమ్మ రొద్దం పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తూ రిటైరయ్యారు. ఆమె భర్త బాబయ్య 40 ఏళ్ల క్రితమే మరణించారు. హుస్సేనమ్మకు వందేళ్ల దాటినా చలాకీగా ఉండేవారు. ఈ నేపథ్యంలో వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి 15 మంది పిల్లలున్నారు. వారికి పిల్లలు అంటే హుస్సేనమ్మ మునిమనవళ్లు, మనవరాళ్లు 23 మంది ఉన్నారు.

రైలు నుంచి జారిపడ్డ యువతి



గాయపడిన హరిత

బత్తలపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె హరిత ట్రైన్‌లో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడింది. హరిత కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం తమ్ముడితో కలిసి కలికిరి నుంచి గుంతకల్లుకు ట్రైన్‌లో బయలుదేరింది. మండలంలోని డి చెర్లోపల్లి సమీపంలో ఆ రైలు వెళ్తుండగా.. వాష్ రూంకు వెళ్లిన ఆ యువతి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడింది. హరిత ఎంతసేపటికీ రాకపోవడంతో ఆమె తమ్ముడు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు హరిత సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమె లోకేషన్ గుర్తించి ట్రాక్‌మన్ మస్తాన్‌ను అప్రమత్తం చేశారు. అతను ఆ యువతి పడి ఉన్న ప్రదేశానికి వెళ్లి.. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే పోలీసులు ఆమెను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుపై ధాన్యం..!

కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది కొరత
సంచులను సమకూర్చని అధికారులు
మూడు కేంద్రాల పర్యవేక్షణకు ఒక్కరే..!
ప్రభుత్వం చొరవ చూపినా.. క్షేత్రస్థాయిలో వైఫల్యం



కణేకల్లు సమీపంలో ఆరబోసిన వరిధాన్యం

రాయదుర్గం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువకాలువ కింద ఖరీఫ్‌లో పండించిన వరిధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా, అధికారులు సరైన ప్రణాళికను అమలు చేయడం లేదు. దీంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగలేక తక్కువ ధరకే దళారులకు అమ్మి నష్టపోతున్నారు. మరోవైపు సిబ్బంది కొరత, ఖాళీ సంచుల లోటు వేధిస్తున్నాయి. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో 28 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగైంది. వరి ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు కణేకల్లు, ఉద్దేహాళ్, శ్రీధరఘట్టలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. పౌర సరఫరాల శాఖ నిర్దేశించుకున్న ఐదువేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ఇప్పటికే పూర్తి అయింది. అదనంగా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ కొనుగోలు చేసేందుకు తగినంత సిబ్బందిని అధికారులు నియమించలేదు. ఈ-క్రాప్ బుకింగ్‌లో వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది.

మూడు కేంద్రాలకు ఒక్కరే..

ధాన్యం కొనుగోలు చేయడానికి మూడు కేంద్రాలకు ఒక్కరినే నియమించారు. ధాన్యం కొనుగోలు బాధ్యతను ఎఫ్‌పీసీఎస్, పీఏసీఎస్‌కు అప్పగించారు. వారు డిమాండ్‌ను బట్టి సిబ్బందిని నియమించుకోవాలి. సిబ్బందికి పౌరసరఫరాల శాఖ శిక్షణ ఇస్తుంది. కానీ ఆ దిశగా చర్యలు లేవు. సమన్వయం లోపించడంతో సమస్య తలెత్తింది. కొనుగోలు చేసిన వెంటనే ప్రభుత్వం డబ్బులు ఇస్తోందని, కానీ అధికారుల నిర్లక్ష్యంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంచుల కొరత

కొనుగోలు కేంద్రాలలో రైతులకు తగినన్ని సంచులను మిల్లర్లు సమకూర్చడం లేదు. ఆన్‌లైన్‌లో 45 కిలోల బస్తాకు మాత్రమే అనుమతి ఉంది. ఆ సంచులను సరఫరా చేయడం లేదు. కొందరు మిల్లర్లు 75 కిలోల ఖాళీ సంచులను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నా, అధికారులు అనుమతించడం లేదు. ఆన్‌లైన్ సాకును చూపి కాలయాపన చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం శాంపిల్స్‌ను తీసువచ్చి.. పరిశీలన అధికారుల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

చలిలో కాపలా

హెచ్చెల్సీ ఆయకట్టులో నవంబరు చివరివారం నుంచే వరి కోతలు మొదలయ్యాయి. యంత్రాల కొరతతో కొన్నిచోట్ల జాప్యం జరిగింది. డిసెంబరు చివరి వారంలో ఊపందుకుంది. ఆయకట్టులో ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయి. చలిలో రాత్రిళ్లు కాపలా కాస్తూ ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలకు తరలించి, అమ్మాలని రైతులు ప్రయత్నిస్తున్నా.. అధికారుల తీరుతో సాధ్యం కావడం లేదు. దీంతో ఓపిక నశించి, రైతులు తక్కువ ధరకే దళారులకు అమ్ముతున్నారు. కొనుగోలు కేంద్రాలలో క్వింటానికి గ్రేడ్ వన్ రకం రూ.2,320, సాధారణ రకం రూ.2300 ధర ఇస్తున్నారు. మార్కెట్‌లో రూ.2100 ప్రకారం దళారులు కొంటున్నారు. పైగా డబ్బులు చెల్లించేందుకు నెల రోజుల సమయం తీసుకుంటున్నారు.

ఎదురు చూస్తున్నా..



రెండున్నర ఎకరాలలో వరి పంటను 15 రోజుల క్రితం కోతకోసి ధాన్యాన్ని రోడ్‌లో వేసుకున్నాను. కొనుగోలు కేంద్ర అధికారుల కోసం ఎదురుచూస్తున్నాను. రేపు, మాపు అంటూ కాలాయాపన చేస్తున్నారు. ప్రతి రోజూ ఎండ బెండుతున్నాను. ధాన్యం బాగా ఎండిపోయింది. అధికారులు వెంటనే కొనుగోలు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

\- రహిమాన్‌ఖాన్, కణేకల్లు

ఖాళీ సంచులు లేవు..



అంబాపురం వద్ద పదెకరాలలో వరి కోత కోసి విక్రయానికి సిద్ధంగా ఉంచాను. ప్రభుత్వం కొనుగోలు చేస్తుందేమోనన్న ఆశతో కణేకల్లు ఆదర్శ భారతి సొసైటీలో పేరు నమోదు చేసుకున్నాను. ఈ నెల 18వ తేదీ నుంచి ఖాళీ సంచుల కోసం తిరుగుతున్నాను. ఇప్పటికీ ఇవ్వలేదు. అధికారులు వెంటనే స్పందించాలి.

\- స్వాములు, రైతు, అంబాపురం

టార్గెట్ పెంచి సిబ్బందిని నియమిస్తాం

ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలను ఒక్కరే పర్యవేక్షిస్తున్నారు. అదనపు సిబ్బంది నియమించేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరాము. త్వరలో నియమిస్తారు. ఖాళీ సంచుల కొరత తలెత్తకుండా ఎప్పటికపుడు సరఫరా చేస్తున్నాం. సహకార సంఘాలు తగినంత సిబ్బందిని నియమించుకోలేదు. పర్యవేక్షించి, సిబ్బందిని నియమిస్తాం. ఐదు వేల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. టార్గెట్ ఇప్పటికే పూర్తి కావస్తోంది. అదనపు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించింది. టార్గెట్‌ను పెంచుకుని రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. మిల్లర్లతో కూడా చర్చించి సంచుల కొరత లేకుండా చూస్తాం.

\- రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ

మార్కెట్‌లో అమ్మేశా..



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరిగే ఓపికలేక పది రోజుల క్రితమే మార్కెట్‌లో అమ్మేశాను. ప్రభుత్వం క్వింటానికి రూ.2320 ఇస్తోందని తెలిసి అధికారుల చుట్టూ తిరిగాను. కార్యాలయాల చుట్టూ తిరిగాను. ఖాళీ సంచులు ఇవ్వలేదు. బతిమాలినా పట్టించుకోలేదు. అందుకే నష్టానికి అమ్ముకున్నాను.

\- రాము, గంగలాపురం

జోరుగా ఇసుక దందా

పట్టించుకునే నాథుడే లేడు
కొందరు అధికారులకు ముడుపులు



కల్లుదేవనహళ్లి వద్ద వేదవతి హగరి నదిలో ఇసుక తవ్వకాలు ఇలా..

బొమ్మనహాళ్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉచితం ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఇది కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. మండలంలోని కల్లుదేవనహళ్లి వేదావతి హగరి నుంచి ట్రాక్టర్లలో ఇసుకను పట్టపగలే తవ్వకుని దర్జాగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉరవకొండ, గుంతకల్లు, విడపనకల్లు ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. తోడుకున్నోళ్లకు తోడుకున్నంత అన్నరీతిలో ఇక్కడి నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక దందాలో కొందరు అధికారులకు ముడుపులు అందుతున్న కారణంగా పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఇసుకను అక్రమంగా వేదావతి హగరి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పనుల ఉపయోగానికి అనుమతి తీసుకుని ఇసుకను తరలించుకోవాలి. ఇతర ప్రాంతాలకు తరలించినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై పటిష్ట నిఘా పెట్టి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసులు నమోదు చేయిస్తాం.

\- మునివేలు, తహసీల్దార్

శవంతో ధర్నా

రోడ్డుపై మూడు గంటలపాటు బైఠాయింపు
పోలీసుల తీరుపై విమర్శలు



రోడ్డుపై శవంతో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

గోరంట్ల, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): మండంలోని హిందూపురం ప్రధాన రహదారిపై గుమ్మయ్యగారిపల్లి సమీపాన ఫంక్షన్‌హాల్ వద్ద మల్లాపల్లి వాసులు బుధవారం శవంతో ధర్నాకి దిగారు. మూడుగంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. పెద్దఎత్తున పోలీసులు అక్కడికి చేరుకుని, ట్రాఫిక్‌ను మళ్లించారు. మల్లాపల్లికి చెందిన టీడీపీ నాయకుడు స్టోర్ డీలర్ శ్రీధర్ భూవివాదం కారణంగా ఈనెల 9న సెల్ఫీ వీడియో తీసి, ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ అతడు బెంగళూరు ఆస్పత్రిలో మృతిచెందాడు. గోరంట్ల పోలీసులు భూవివాదానికి కారకులైన ఏడుగురితోపాటు ఇతరులపై కేసు నమోదు చేసి, సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితుడైన మల్లాపల్లికి చెందిన పెయ్యాల వెంకటరెడ్డి (55).. పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో పదిరోజులుగా కర్ణాటకలోని కోడిపల్లిలో బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడు ఈనెల 23న గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. బుధవారం ఉదయం వెంకటరెడ్డి మృతదేహంతో కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున గోరంట్ల పోలీసు స్టేషన్ ముందు ఆందోళన తలపెట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారికి ఎదురెళ్లి గుమ్మయ్యగారిపల్లి వద్ద అడ్డగించారు. దీంతో అక్కడే వారు రోడ్డుపై శవాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. శ్రీధర్ ఆత్మహత్య కేసులో అతడి సెల్ఫీ వీడియో వాంగ్మూలం మేరకు కాకుండా కొంత మంది పేర్లు తొలగించి, తమను అక్రమంగా ఇరికించారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల వేధింపుల కారణంగానే వెంకటరెడ్డి మృతిచెందినట్లు ఆరోపించారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో పెనుకొండ, ధర్మవరం డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, గోరంట్ల, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి సీఐలు శేఖర్, రాఘవన్, రాగిరి రామయ్య, సునీత, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పెద్దఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకున్నాయి. బాధితులతో అధికారులు చర్చించినా వారు ససేమిరా అన్నారు. న్యాయం చేస్తామని డీఎస్పీలు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఉదయం 7.15 నుంచి 10.15 గంటల వరకు ఆందోళన కొనసాగింది. గోరంట్ల సీఐ శేఖర్ మాట్లాడుతూ.. కర్ణాటకలోని కోడిపల్లిలో తలదాచుకున్న వెంకటరెడ్డి 23న సాయంత్రం వాకింగ్‌కు వెళ్లి కింద పడిపోయి మృతిచెందాడన్నారు. పోలీసుల కేసు కారణంగా కర్ణాటకలో ఉంటున్న ఆయన మృతిచెందినట్లు గౌరీబిదనూర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించి పంపినట్లు సీఐ వివరించారు. వెంకటరెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేపడతామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

సెమీస్‌కు మహారాష్ట్ర.. ఇంటికి ఆంధ్రా

డ్రాగా ముగిసిన మ్యాచ్



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సుభంకాదం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చిన మహారాష్ట్ర సెమీస్‌కు అర్హత సాధించగా....అన్ని విభాగాల్లో చేతులెత్తేసిన ఆంధ్రా ఇంటి ముఖం పట్టింది. బీసీసీఐ కూచ్ బెహార్ అండర్-19 ట్రోఫీ ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆర్డీటీ స్టేడియంలో బుధవారం నాలుగో రోజు ముగిసింది. ఓవర్‌నైట్ స్కోర్ 173-3గా నాలుగో రోజు ఆటను ఆరంభించిన మహారాష్ట్ర వికెట్ నష్టపోకుండా 116.3 ఓవర్లలో 305 పరుగులు చేసింది. బ్యాటర్లు సుస్రుత్‌సావంత్ (117), నిఖిల్ లునావత్ (100)లు 211 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆధిక్యంలో కొనసాగిన మహారాష్ట్ర జట్టు సెమీ ఫైనల్‌కు క్వాలిఫై అయ్యింది. దీంతో ఈనెల 30వతేదీ నుంచి చెన్నైలో తమిళనాడుతో మహారాష్ట్ర సెమీస్ ఆడనుంది. ఇదిలా ఉంటే...మహారాష్ట్ర మొదటి ఇన్నింగ్స్‌లో 420 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన సుస్రుత్ సావంత్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ చేశాడు. మరో బ్యాటర్ కిరణ్ చోర్మలే సెంచరీ చేసి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ఆంధ్రా మొదటి ఇన్నింగ్స్‌లో మహారాష్ట్ర బౌలర్ల ధాటికి 143 పరుగులకే కుప్పకూలింది. మహారాష్ట్ర స్పిన్నర్ సుభంకాదం 6వికెట్లు తీశారు. ఇక చివరి రోజు మహారాష్ట్ర బ్యాటర్లు సుస్రుత్ సావంత్, నిఖిల్ లునావత్ వికెట్ నష్టపోకుండా క్రీజును అంటిపెట్టుకుని రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను డ్రాగా ముగించి జట్టును సెమీస్‌కు తీసుకెళ్లారు. అటు బ్యాటింగ్‌లోనూ...ఇటు బౌలింగ్‌లోనూ విఫలమైన ఆంధ్రా జట్టు ఇంటి ముఖం పట్టింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సుభంకాదమ్ నిలిచారు. కార్యక్రమంలో బీసీసీఐ సెలెక్టర్ హర్వీందర్‌సింగ్ సోధి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్, మహారాష్ట్ర సెలెక్షన్ కమిటీ చైర్మన్ మిలింద్‌గుంజాల్, జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, ఏసీఏ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్ చౌదరి, ఎంసీఏ హెడ్‌కోచ్ అజయ్‌చౌహాన్, ఏసీఏ హెడ్‌కోచ్ ప్రదీప్, ఏడీసీఏ కోశాధికారి షబ్బీర్, ఏసీఏ, ఏడీసీఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురి అరెస్ట్

తాడిపత్రి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో ఈనెల 23న అదే గ్రామానికి చెందిన వంశీని హత్యచేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. వంశీ హత్య కేసులో రావివెంకటాపల్లికే చెందిన పెద్దిరాజు, రంగనాయకులు, వెంకటాంపల్లికి చెందిన రవికాంత్, నరసయ్యగారి వెంకటేష్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి కత్తి, గుండురాయి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రావివెంకటాంపల్లికి చెందిన పెద్దిరాజు, రంగనాయకులు ఐషర్ వాహనానికి వెళ్లేవారని, అదే గ్రామానికి చెందిన వంశీ కూడా ఈ వాహనానికి క్లీనర్‌గా వెళ్లేవాడన్నారు. ఈ క్రమంలో క్లీనర్‌గా వెళ్లినందుకు డబ్బులు ఇవ్వకపోవడంతో పెద్దిరాజు, రంగనాయకులును వంశీ కొట్టాడన్నారు. ఈ విషయంలో రంగనాయకులు, పెద్దిరాజుతోపాటు అతని చిన్నాన్న నాగరాజు కుమారుడు రవికాంత్ అలియాస్ రవి, వెంకటేష్ పెద్దిరాజుకు మద్దతుగా నిలిచారన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న వంశీ రెండువారాల అనంతరం రవికాంత్‌ను కొట్టించి మీరు నన్ను ఏమి చేసుకోలేరని గ్రామంలో చెప్పుకొనేవాడన్నారు. దీంతో నలుగురు వంశీపై కక్షకట్టి ఎలాగైనా హతమార్చాలని పథకం రచించారన్నారు. ఈ క్రమంలో వంశీ గ్రామ సమీపంలోని కంపచెట్లలో ఒంటరిగా మద్యం సేవించడం చూసి కొన్నిరోజులు నలుగురు కలిసి రెక్కీ నిర్వహించారన్నారు. ఈ మేరకు ఈనెల 23న నలుగురు నిందితులు వంశీపై కత్తితో దాడిచేసి అక్కడే ఉన్న బండరాయితో తలపై బాదారన్నారు. దీంతో వంశీ అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. అందిన సమాచారం మేరకు బుధవారం పట్టణ సమీపంలోని ఆటోనగర్ బైపాస్‌రోడ్డులో ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కాపాడేందుకు వెళుతుండగా ఆటో బోల్తా... తండ్రికి తీవ్ర గాయాలు



అభిలేష్ (ఫైల్)

గుమ్మఘట్ట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జె.వెంకటంపల్లిలో బుధవారం ఉదయం విద్యుత్‌షాక్‌తో అభిలేష్(20) అనే యువకుడు మృతి చెందాడు. కాపాడేందుకు ఆటోలో తీసుకెళుతూ మార్గమధ్యంలో బోల్తాపడి తండ్రి శివన్న తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్థులు, కుటుంబసభ్యుల వివరాల మేరకు.. శివన్న ఇల్లు కడుతున్నాడు. ఆయన కుమారుడు అభిలేష్ ఇంటికి నీళ్లు పెడుతుండగా మోటారుకు అమర్చిన వైరు తొలగిపోయింది. దీంతో వైరును సరిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. కుమారుడిని కాపాడుకోవాలని ఆసుపత్రికి ఆటోలో తరలిస్తుండగా రాయదుర్గం సమీపంలో అది బోల్తా పడి తండ్రి శివన్న సైతం తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. శివన్నకు భార్య, మరో ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు మరణించడం, తండ్రి ఆస్పత్రి పాలవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. క్రిస్మస్ రోజున ఈ సంఘటన చోటు చేసుకోవడం బాధ కలిగిస్తోందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాదంతో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

ఫ్యూజు వేస్తూ రైతు..



శంకర్ (ఫైల్)

గాండ్లపెంట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుంట్లపల్లికి చెందిన రైతు శంకర్ (55) బుధవారం విద్యుదాఘాతంతో మరణించాడు. ఏఎస్ఐ రంగా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకర్ తనకున్న భూమిలో వరి సాగు చేశాడు. పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఇటీవల వర్షాల కారణంగా ఫ్యూజులు తీసేశారు. ఫ్యూజులు వేస్తుండగా బోరు స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా అయి, శంకర్‌కు షాక్ తగిలి, అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి, కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, శవాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైతు శంకర్‌కు భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు మృతిపై కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

లారీని ఢీకొని యువకుడు...



బాబాఫక్రుద్దీన్ ఫైల్

కదిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద ఉన్న వై జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడికి గాయాలైనట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. కుటాగుళ్లకు చెందిన బాబాఫక్రుద్దీన్(22), అతడి స్నేహితుడు అతుల్‌ఖాన్ మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి బయటకు వెళ్లారు. ఇద్దరు బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు ద్విచక్రవాహనంలో వస్తుండగా.. కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాబా ఫక్రుద్దీన్ అక్కడికక్కడే మృతచెందగా, వెనకవైపు కూర్చున్న అతుల్‌ఖాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్సల కోసం అనంతపురం తరలించారు. బాబాఫక్రుద్దీన్ ఆటో తోలుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి సాదిక్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుత్తి వద్ద బేల్దారి..

గుత్తిరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భాస్కర్ (29) అనే వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం యంగన్నపల్లికి చెందిన భాస్కర్, లక్ష్మణ్, బాలకృష్ణ ముగ్గురు కలసి బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. తొండపాడు గ్రామంలో రోడ్డు పక్కనే బేల్దారి పని ముగించుకొని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరారు. కొంచెం ముందుకు వెళ్లిన వెంటనే సెల్‌ఫోన్ మరచిపోవడంతో నడుచుకుంటు పని చేస్తున్న ఇంటిలోకి వెళ్లి తీసుకుని భాస్కర్, లక్ష్మణ్ ఇద్దరు కలసి వస్తుండగా.. లారీ వచ్చి ఢీ కొట్టడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్ అనే వ్యకికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తం

సభ్యత్వ నమోదుకు విరాళాలు



విరాళం అందజేస్తున్న వేణి మనోహర్

అనంతపురం అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వాల కోసం 25వ డివిజన్ టీడీపీ నాయకులు వేణి మనోహర్, విజయ్ రూ.50వేలు, రజక కార్పోరేషన్ మాజీ చైర్మన్ నాగేశ్వరరావులు రూ.50వేలు విరాళం అందించారు. బుధవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో వేణి మనోహర్ రూ.50వేలు విరాళాన్ని ఎమ్మెల్యేకి అందించారు. ఎమ్మెల్యే సోదరుడు దగ్గుపాటి రాజాకు నాగేశ్వరరావు రూ.50వేలు విరాళం అందజేశారు. వీరిద్దరిని ఎమ్మెల్యే అభినందించారు.

నేడు నిజపాద స్పర్శ దర్శనం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో గురు వారం స్వామివారి నిజపాద స్పర్శ దర్శనం నిర్వహించనున్నట్లు భావసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ బుధవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మార్గశిరశుద్ధ సఫల ఏ కాదశిని పురస్కరించుకుని భక్తుల చేతులమీదుగా స్వామి వారి పాదస్పర్శ చేయిస్తామన్నారు. భక్తులు విరివిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

రేపు పుస్తక పరిచయ సభ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న పుస్తక పరిచయ సభను విజయవంతం చేయాలని ఆ వేదిక ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖరశాస్త్రి బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాల్‌లో సభ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రైతు కవి దర్భశయనం శ్రీనివాసాచార్య వెలువరించిన 'మట్టి మట్టి' పుస్తకాన్ని సమీక్షిస్తామన్నారు. కావున సాహితీకారులు, సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

ఎస్కేయూ పరిసరాల్లో గడ్డికి నిప్పు

● సకాలంలో మంటలార్పిన సిబ్బంది

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆవరణలోని ఎండుగడ్డికి బుధవారం రాత్రి అకతాయులు నిప్పుపెట్టారు. చిత్రావతి హాస్టల్ వెనుక, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని ఇన్‌చార్జ్ వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబుకు తెలియజేయడంతో ఉద్యోగులు, హాస్టల్ సిబ్బందిని రంగంలోకి దింపారు. అగ్నిమాపక శాఖకు సమాచారాన్ని తెలియజేయడంతో ఫైర్‌ఇంజన్ వచ్చినా మంటలు చెలరేగిన ప్రాంతానికి చేరుకోలేకపోయింది. రిజిస్ట్రార్ రేమష్‌బాబు వర్సిటీ సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేలా పురమాయించారు. సుమారు మూడు గంటలపాటు శ్రమించి చెట్ల కొమ్మలు, గోనె సంచులు తదితర వాటితో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో సోలార్ ప్యానల్స్‌కు, చెట్లకు హాని కలుగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు, ఉద్యోగులు ఉమాపతి, రామమోహన్, లాలు, మారయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు సాగుకు సిద్ధం




చెరువులో నాయకుల గంగపూజ

శింగనమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శింగనమల చెరువు ఆయకట్టు కింద పంటల సాగు కోసం రైతు లు సిద్ధమయ్యారు. ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్య నారాయణ, ఉపాధ్యక్షుడు పత్రా ఎర్రిస్వామి, రైతులు బుధవారం శింగనమల చెరువులో చెరువులో గంగపూజ చేశారు. తూములు ఎత్తి కాలవలకు నీటి విడుదల చేశారు. ఈ సారి ఆయకట్టు కింద ఎక్కువ శాతం రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు డైరెక్టర్లు గొల్ల రామన్న, నరసింహులు, రైతులు పెద్ద నాగముని, ఆదినారాయణ, సూర్యప్రకాశ్, శంకర్ నారాయణ, మూసుద్ వలి, బి.శంకర్, కాయల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

● కేఎస్ఎన్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షఫి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షఫీ పేర్కొన్నారు. కళాశాల వాణిజ్యవిభాగంలో బుధవారం వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. వాణిజ్య విభాగాధిపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షఫీ హక్కులపై వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు ధనలక్ష్మీ, గిరిజ, మల్లికార్జున, రామకృష్ణ, రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రినేషనల్ చర్చిలో క్రిస్మస్ ట్రీ



కాంగ్రినేషనల్ చర్చి పశువులపాకలో బాలయేసు



హెర్మోన్ చర్చిలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానవాళికి దివ్యసందేశాలను వినిపించిన యేసుక్రీస్తు భూమిపై అవతరించిన రోజైన క్రిస్మస్ వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడుతూ దేదీప్యమానంగా వెలుగొందాయి. ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వ హించారు. జిల్లా కేంద్రంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న ఎస్‌ఐయూ టౌన్ కాంగ్రినేషనల్ చర్చి, అరవిందనగర్‌లోని సీఎస్ఐ హోలి ట్రినిటీ చర్చి, జీసస్ కంపాషన్ చర్చి, రామచంద్రనగర్‌లోని కార్మెల్‌మాత చర్చి, అంబేడ్కర్ నగర్‌లోని యేసుక్రీస్తు ప్రార్థనా మందిరం, కళ్యాణదుర్గం రోడ్డులోని క్రీస్తుసంఘం చర్చి, కోర్టు రోడ్డులోని గాస్పెల్ హాల్ చర్చి, నాయక్‌నగర్‌లోని అగాపే చర్చిలతో పాటు వివిధప్రాంతాల్లోని చర్చిలన్నింటిలోనూ క్రైస్తవులు విశేషంగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్ఐయూ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సంపత్ విజయ్‌కుమార్ దైవసందేశం ఇచ్చారు. సాయంత్రం మ్యూజికల్ నైట్ పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జీసస్ కంపాషన్ చర్చిలో మోజస్ అనీల్‌కుమార్, సీఎస్ఐ చర్చిలో శంషాబాద్‌లోని మెన్నోనైట్ బ్రేత్రెన్ సెంచనరీ బైబిల్ కళాశాల ప్రొఫెసర్ రెవరెండ్ శామ్యూల్ రాజశేఖర్, రెవరెండ్ బెన్‌హర్‌బాబు దైవసందేశాన్నిచ్చారు. అనంతరం కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇలా జిల్లావ్యాప్తంగా ప్రార్థనామందిరాలన్నింటిలోనూ క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అలాగే రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని చర్చిలకు ఎమ్మెల్యే పరిటాల సునీత టీడీపీ స్థానిక నాయకుల ద్వారా క్రిస్మస్ కేక్ పంపి, కట్ చేయించారు.





ఎస్ఐయూ టౌన్ కాంగ్రినేషనల్ చర్చిలో దైవ సందేశమిస్తున్న పాస్టర్ సంపత్ విజయ్‌కుమార్, హాజరైన క్రైస్తవులు

యుగకర్త యేసు : ఎమ్మెల్యే దగ్గుపాటి

సర్వ మా నవాళికి శాంతి సందేశమిచ్చిన యుగకర్త యేసుక్రీస్తు అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆయన సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ చర్చి, జీసస్‌నగర్‌లోని హెర్మోన్ చర్చి, అర విందనగర్‌లోని సీఎస్ఐ హోలి ట్రినిటి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రేమ మార్గంలో ఎవరి మనసునైనా జయించవచ్చునని యేసుక్రీస్తు నిరూపించారన్నారు. కర్తవ్యం, ప్రేమ, కరుణ, సహనం, దయ, త్యాగం అనే గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాస్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, ఆర్యవైశ్య సంఘం నాయకుడు తాటి మధు తదితరులు పాల్గొన్నారు.

గోకులంపై రైతుల ఆసక్తి

● అధికారులకు అందుతున్న వందల కొద్ది దరఖాస్తులు

శింగనమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి సారిం చింది. మునుపటి లాగే మినీ గోకులం నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. వీటి నిర్మాణం కోసం పశుపోషకు లకు 90 శాతం రాయితీ ఇవ్వాలని పశుసంవర్ధ కశాఖ కు మార్గాదర్శకాలు జారీ చేసింది. 2018 లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలకు శ్రీకారం చుట్టగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని గాలి కొదిలేసింది. దీంతో నిధులు మంజూరు కాక రైతులు వెనక్కు తగ్గారు. తిరిగి కూటమి అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించి పశుపోషణకు మేలే చేకూరుస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శింగనమలలో పూర్తయిన గోకులం షెడ్డు

వేగంగా నిర్మాణాలు

శింగనమల మండలంలో 69 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. నెల రోజుల్లోగా అన్ని నిర్మాణాలను ప్రారంభించారు. ప్రస్తుతం 30 షెడ్లు పూర్తయ్యారు. మిగిలిన 39 షెడ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో అధికారులు చొరవతీసుకుని లబ్ధిదారులతో త్వరితగతిన షెడ్లు పూర్తి చేయిస్తున్నారు.

ఆసక్తి చూపుతున్న రైతులు

మండలంలో మెదటి దశలో కేవలం 69 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అయితే వాటి నిర్మాణాలు పూర్తి కావడంతో, గోకులం షెడ్ల కోసం మండలంలో వంద సంఖ్యలో రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో రెండో విడతగా 79 షెడ్లు కావాలని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. అయితే ఇంకా మంజూరు కాలే దు. ఇదిలాఉండగా గోకులం షెడ్ల కోసం రైతుల చేసుకున్న దరఖాస్తులు అధికారు లకు వందల కొద్ది వచ్చినట్లు తెలుస్తోంది. వెంటనే మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్న రైతులు డిమాండ్ చేస్తున్నారు.

31లోగా పూర్తి చేస్తాం

మండలంలో మంజూరైన 69 గోకులం షెడ్లలో ఇప్పటికే 30 పూర్తయ్యాయి. ఇంకా 39 వివిధ దశల్లో ఉన్నాయి వాటిని డిసెంబరు31లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. షెడ్ల నిరానానికి నిధులు పూర్తిస్థాయిలో మంజూరవుతుండడంతో రైతులు ముందుకు వస్తున్నారు.

- శ్రీదేవి, ఏపీఓ, శింగనమల

టీచర్ల బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న కులశేఖర్‌రెడ్డి

అనంతపురం విద్య, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉంచిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ కమిటీ సమావేశం నిర్వహించిరు. ఈ సమావేశానికి రాష్ట్ర పూర్వపు ప్రధానకార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ హాజరై మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిటీ వేసి వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాల న్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ ఉత్తర్వులు 72, 73, 74 ద్వారా జేఎల్, డైట్ లెక్చరర్ పోస్టులను సీనియర్ స్కూల్ అసిస్టెంట్లతో, డీవైఈఓ పోస్టులను సీనియర్ హెచ్‌ఎంలతో భర్తీ చేయాలన్నారు. 2003 డీఎస్సీ టీచర్లకు ఓపీఎస్ అమలుచేయాలన్నారు. వంద రోజుల కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులకు ఎండీఎం, రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. టీచర్ల ట్రైనిం గ్స్ కారణంగా సిలబస్ పూర్తికావడం లేదని, సమ్మర్ హాలిడేస్‌లో వీటిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. తర్వాత జిల్లా కార్యదర్శిగా అశోక్ నాయక్‌ను, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా తిరుపాల్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అంజనేయులు, వెంకటరెడ్డి, సత్యప్రసాద్, వజీర్ భాషా, సాయినాథ్‌రెడ్డి, అశోక్ నాయక్, తిరుపాల్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

విలువలకు నిలువుటద్దం.. వాజ్‌పేయి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : దేశం గర్వించేలా ప్రజా పాలన అందించిన మాజీ ప్రధాని అటల్ వాజ్‌పేయి విలువలకు నిలువుటద్దమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. వాజ్‌పేయి శతజయంతిని పురస్కరించుకుని బుధవారం బీజేపీ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడారు. ఒక పార్టీ నాయకుడిగా కాకుండా దేశానికి నా యకుడిగా వాజ్‌పేయి సేవలందించారని గుర్తుచేశారు. మూడుసార్లు ప్రధానిగా, పోఖ్రాన్ అణుపరీక్షలు, కార్గిల్ యుద్ధం తదితర ఎన్నో విజయా లను వాజ్‌పేయి సాధించారని తెలిపారు. రాజకీయాల్లో అజాత శత్రువుగా అందరి మన్ననలు పొంది మరపురాని రాజనీతిజ్ఞుడిగా వెలుగొందారన్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి జాతిగర్వించేలా దేశప్రతిష్ఠను ఇనుమడింపచేసిన వాజ్‌పేయి జీవితచరిత్ర ప్రజల్లో చిరకాలం నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న బీటీ రోడ్డుకు మరమ్మతులు



ఇంతకు ముందు కందుకూరు రోడ్డు దుస్థితి



ప్యాచ్ వర్కులు చేసిన తరువాత....

● ప్రజలు, ప్రయాణికుల హర్షం

అనంతపురంరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం- కందుకూరు రోడ్డంటే గతంలో అందరూ హడిలిపోయేవారు. 2022లో బీటీ రోడ్డు నిర్మించారు. అయితే వేసిన ఏడాదికే రోడ్డు దెబ్బతింది. ఇరువైపులా గుంతలు పడ్డాయి. దీంతో వాహన దారులు రాకపోకలు సాగించాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. ఏ గుంతల్లో పడిపోతామో అనే భయాందోళనకు గురయ్యేవారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చాయంటే అంతేసంగతి అన్న విధంగా ఉండేది. వాహనాన్ని పక్కకు దింపే పరిస్థితి ఉండేదీ కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి వాహనదారులకు విముక్తి లభించింది. గుంతలు పడ్డ రోడ్డులో ప్యాచ్ వర్కులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ క్రమంలో దెబ్బతిన్న రోడ్డుకు వారం రోజుల కిందట మరమ్మతులు చేశారు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల అవస్థల ప్రయాణానికి మోక్షం లభించినట్లు అయిందంటూ ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

సభ్యత్వాలపై అధిష్టానం నిశిత పరిశీలన

● పార్టీ ముఖ్యనాయకులతో ఎమ్మెల్యే దగ్గుపాటి



ముఖ్యనాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాల నమో దు అంశాన్ని పార్టీ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన బుధవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో నియోజకవర్గం పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి పలువురు టీడీపీ ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. అర్బన్ పరిధిలో ఇప్పటి వరకు జరిగిన సభ్యత్వాలపై ఆరా తీశారు. సభ్యత్వాల నమోదులో ముందున్న నాయకులను అభినందించారు. పార్టీ అధిష్టానం మనపై నమ్మకంతో ఈ బాధ్యత పెట్టిందన్నారు. కావున మనం మరింత కష్టపడి పనిచేయాల్సిందిపోయి కొందరు నాయకులు సభ్యత్వాల నమోదులో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. పార్టీ అధిష్టానం అన్నీ పరిశీలిస్తోందని, ఇప్పటి నుంచైనా లక్ష్యం మేరకు నమోదు చేయించేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళి, గోపాల్ గౌడ్, సుధాకర్ యాదవ్, కూచి హరి, రాజారావు, వన్నూరప్ప, దళవాయి వెంకట నారాయణ, గుర్రం నాగభూషణం, సైపుద్దీన్, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, తమ్మినేని వేణు, వడ్డే భవాని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో జిల్లా పేరు వినిపించాలి : ఎమ్మెల్యే



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పేరును జాతీయ స్థాయిలో వినిపించేలా క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. రైల్వే కోడూరులో జరిగిన కురాష్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో నగరంలోని పలు పాఠశాలతో పాటు కూడే రు, బుక్కరాయసముద్రం కేజీబీవీలకు చెందిన విద్యార్థులు 30 బంగారు పతకాలు సాధించి, ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు. వీరంతా త్వరలో జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. వారు బుధవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఆయన అభినందించారు. జాతీయ క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ ప్రైవేటీకరణను వెంటనే నిలిపి వేసి, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యుల రైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. చండీగఢ్ విద్యుత్ ఉద్యోగుల ఆందోళనకు మద్ద తుగా బుధవారం సీఐటీయూ ఆధ్వ ర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరస న వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేం ద్రకుమార్ మాట్లాడుతూ... కేంద్రంలో వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం గతంలోకన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. విద్యుత్‌రంగంపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడికి ప్రత్యక్షంగా ప్రజలు బలిపశువులవు తారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ కార్మికులు వీరోచితమైన పోరాటం చేస్తున్నారన్నారు. సీఐటీయూ బల పరుస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర అధ్యక్ష కార్యదర్శులు ముత్తుజా, వెంకటనారాయణ, యునైటెడ్ ఎలె క్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూని యన్ కార్యదర్శి మధు, సీఐటీయూ నాయకులు మస్నీల రామాంజనేయులు, లతీఫ్, బండారి ఎర్రిస్వామి, బీహెచ్ రాయుడు, ఆజం బాషా, నాగరాజు పాల్గొన్నారు.

రెండు రోజులు విద్యుత్ బంద్

శింగనమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని తరిమెల, సలకంచెరువు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు గురు, శుక్రవారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. వాటి పరిధిలో ఆర్‌డీఎక్స్ పథకం కింద ప్రత్యేక బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెండు రోజుల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తునట్లు అయన తెలిపారు

న్యూస్ బాక్స్

వైసీపీ నిరసనను అడ్డుకుంటాం: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ 27వ తేదీన చేపట్టే నిరసన కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు పాపం వైసీపీదేనన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 28వేల కోట్ల భారం మోపారన్నారు. నాయకులు గోవిందు, వెంకటేష్, బీరే శేఖర్, తాజుద్దీన్, ఈడిగ వేణు, పల్లా నరసింహులు, రమేష్, నిమ్మల ప్రసాద్, ప్రభాకర్, సుదర్శన్, లాల్‌స్వామి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికుల రోదనతో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బుధవారం స్థానిక 4వ డివిజన్ వద్ద నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవఅధ్యక్షుడు వీరభద్రస్వామి, సీఐటీయూ మండల కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ కార్మికుల హక్కుగా ఉన్న లీవులు వాడుకుంటే జీతాల బిల్లులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. సంఘం అధ్యక్షుడు చిన్నకొండయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సురేష్, గోపీనాథ్, నరసయ్య, ప్రేమ్‌కుమార్, అరుణ, ఏసు, దాసు, పెద్దపెంచలయ్య, రామాంజినమ్మ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



గౌరవ అధ్యక్షుడిని సన్మానిస్తున్న డీలర్ల సంఘం నాయకులు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం డీలర్ల సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బండి కిష్టప్ప, అధ్యక్షుడిగా దాసరి సత్యనారాయణ, కార్యదర్శిగా పసుపులేటి వెంకటేశులు, ఉప కార్యదర్శిగా తిరుమలేషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయదుర్గం పట్టణం, మండలంలోని 51 రేషన్‌షాపు డీలర్లు కలిసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎఫ్‌పీ షాప్ నూతన అధ్యక్షులు కలిసి ఎఫ్‌సీఐ గోదాములో గౌరవ అధ్యక్షులు బండి కిష్టప్పను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మహేష్, తమ్మయ్య, ఆనంద్, తిప్పేస్వామినాయక్ పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

గుత్తి,డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. నాగప్ప, ఆంజనేయులు, సూరి, నాగేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

చురుగ్గా తారు రోడ్డు పనులు

కూడేరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కూడేరు నుంచి కడదరకుంట గ్రామ క్రాస్ వరకు కొన్నేళ్లుగా ప్రధాన రహదారి గుంతల మయంగా మారడంతో కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టి 20 లక్షలతో తారు రోడ్డు పనులు చేపట్టింది. మండల పరిధిలోని కడదరకుంట, కరుట్లపల్లి, జయపురం, చోళసముద్రం, పి.నారాయణపురం తదితర గ్రామాల నుంచి నిత్యం మండల కేంద్రానికి వందలాది మంది ఈ రోడ్డుపైనే ప్రయాణం సాగిస్తున్నారు. సమస్యను మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితోపాటు స్థానికులు తీసుకెళ్లడంతో తక్షణం 20 లక్షలు నిధులు మంజూరు చేయడంతో బుధవారం పనులు చేపట్టారు. మంత్రికి, శ్రీధర్ చౌదరికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

క్రిస్మస్ వేడుకల్లో వివాదం

తాడిపత్రి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో మత పెద్ద ప్రసంగం వివాదాస్పదమైంది. క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న ఆమె.. హిందూ దేవుళ్లను నమ్మవద్దని, ఏసు ప్రభువే మన దేవుడని అన్నారు. దీంతో అక్కడే ఉన్న హిందువులు కొందరు అభ్యంతరం తెలిపారు. విషయం తెలుసుకున్న బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అక్కడికి వెళ్లడంతో కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పొరపాటు జరిగిందని ఆమె ఒప్పుకోవడంతో వివాదం సమసిపోయింది. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఎస్‌ఐలు అక్కడికి వెళ్లి విచారించారు. ఇతర మతాల గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరించారు. అందరినీ అక్కడి నుంచి పంపించారు.

యాడికి పంచాయతీలో వర్గపోరు

- మితిమీరిన వైసీపీ నాయకుల పెత్తనం
- ఎమ్మెల్యేని కలిసిన సర్పంచ్
- పార్టీ వీడతారని ప్రచారం



మీడియాతో సర్పంచ్ అనూరాధ, ఆమె భర్త శ్రీరాములు

యాడికి, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): యాడికి గ్రామ పంచాయతీలో సర్పంచ్ అనూరాధ, వైసీపీ నాయకుల మధ్య వర్గపోరు తీవ్రస్థాయికి చేరుకుంది. పంచాయతీ పాలనా వ్యవహారాల్లో కొందరు వైసీపీ నాయకులు పెత్తనం చలాయిస్తూ సర్పంచును పట్టించుకోకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. సర్పంచ్ అనుమతి లేకుండా వైసీపీ నాయకులు తీర్మానాలు చేసుకొని పనులు చేసుకుంటున్నట్లు తెలిసింది. వైసీపీ నాయకుల వ్యవహారంతో విసుగు చెందిన సర్పంచ్ ఆ పార్టీని వీడిపోతారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో యాడికి సర్పంచ్ అనురాధ బుధవారం తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆమె త్వరలోనే వైసీపీని వీడవచ్చుననే వాదనకు బలం చేకూరుతోంది.

కార్యదర్శి రాకతో ముదిరిన విభేదాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. యాడికి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అశ్వర్థనాయుడు వచ్చారు. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత పనిచేసిన కాలం కంటే సెలవులో ఉన్న రోజులే ఎక్కువగా ఉన్నాయని గ్రామ పంచాయతీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఆయన సర్పంచ్ అనురాధ కంటే వైసీపీ మండల కన్వీనర్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల సర్పంచ్, వైసీపీ మండల కన్వీనర్‌కు మధ్య విభేదాలు తలెత్తినట్లు చర్చ జరుగుతోంది. పాలనాపరమైన నిర్ణయాల్లో సర్పంచు కంటే వైసీపీ మండల కన్వీనర్‌కే కార్యదర్శి ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నట్లు, అందువల్లనే ఆమె వైసీపీని వీడనున్నట్లు వినిపిస్తోంది.

పంచాయతీ అభివృద్ధి కోసమే కలిశాం

గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసమే ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని కలిశామని యాడికి సర్పంచ్ అనురాధ, ఆమె భర్త శ్రీరాములు మీడియా ముందు వెల్లడించారు. గ్రామ పంచాయతీలో చాలా సమస్యలు ఉండడంతో వాటన్నింటిని ఆయనకు విన్నవించామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. పంచాయతీలో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. సీసీరోడ్లు తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించామని తెలిపారు. గ్రామ పంచాయతీని బాగా అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుమ్మఘట్ట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించి స్వామివారి రథాన్ని పురవీధుల్లో ఊరేగించారు. నందికోలాటాల మధ్య బ్రహ్మరథోత్సవం పాదకట్టకు చేర్చి సాయంత్రం తిరిగి గుడికి చేర్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. టీడీపీ కన్వీనర్ గిరిమల్లప్ప, సర్పంచ్ విజయలక్ష్మి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీనారాయణస్వామి సన్నిధిలో జిల్లా న్యాయాధికారి



న్యాయాధికారికి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామ సమీపంలో ఉన్న లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో జిల్లా సెషన్ కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ బుధవారం ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు న్యాయాధికారికి స్వాగతం పలికారు. అర్చకులు న్యాయాధికారి కుటుంబసభ్యుల పేరట అర్చనలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి పరుశురాముడు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



అలంకరణలో స్వామివారు

బెళుగుప్ప, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపల్లిలో బుధవారం సద్గురు నారాయణరార్యుడ స్వామి 51వ ఆరాధన రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్తాడు మఠాధ్యక్షులు జ్ఞానమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది శిష్య బృందం పూజలో పాల్గొన్నారు. సాయంత్రం రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించి రాత్రికి భజన పోటీలు నిర్వహించారు.

గణపతి మండల పూజోత్సవం



హోమం నిర్వహిస్తున్న పండితులు

బెళుగుప్ప, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం గణపతి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మండల పూజోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేరళ వేదపండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన తంత్రి వేద మంత్రోచ్చారణలతో గణపతి హోమం, విశేష కలశపూజ, గణపతి బ్రహ్మ కలశాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాద వినియోగంతో పూజలు ముగిశాయి.

కనకదాస విగ్రహ ప్రతిష్ఠ

డి.హీరేహాళ్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగమనహళ్లి గ్రామంలో కురుబల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మూడురోజులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ముందుగా డప్పు వాయిద్యాల నడుమ మహిళలు కలశాలు పట్టుకుని గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం వేదపండితుల నడుమ ఉదయం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ నాయకుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రూ.లక్ష విరాళం అందించారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి, తిప్పేస్వామి, లాయర్ పంపాపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

కణేకల్లు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో ఉన్న ఆర్డీటీ పాఠశాలలో బుద్ధిమాంద్యం విద్యార్థులకు 1976-77 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అన్నదానం చేశారు. బుధవారం ఆర్డీటీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వేలూరు మరియప్ప, కృష్టారెడ్డి, మున్వర్, నటరాజ్, నరసింహారెడ్డి అన్నదానం చేశారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

కణేకల్లు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోంది. స్థానిక నాయకుడు రఘు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదును చేయిస్తున్నారు. ప్రజలు కూడా సభ్యత్వ నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నట్లు నాయకులు తెలిపారు.

సీపీఐ సభను జయప్రదం చేయండి

రాయదుర్గంరూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే శతవసంతాల సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ తాలూకా కార్యదర్శి నాగార్జున పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గురువారం పట్టణంలోని మొలకాల్మూరు చెక్‌పోస్టు వద్ద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



తాడిపత్రి: వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

యాడికి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు అన్నారు. వాజ్‌పేయి శతజయంతిని పురస్కరించుకొని బుధవారం ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అసెంబ్లీ కో కన్వీనర్ గంగాధర్, నాయకులు చౌడయ్య, లక్ష్మీదేవి, వేణుగోపాల్, జగదీష్, వెంకట, రాజశేఖర్ పాల్గొన్నారు.

తాడిపత్రి: స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం వాజ్‌పేయి శతజయంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కన్వీనర్ రంగనాథరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కణేకల్లు: మాజీ ప్రధాని వాజ్‌పేయి 100వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి కళ్యాణమండపంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లయ్యచౌదరి, కురుబ తిప్పేస్వామి, కే రవికుమార్, నాగభూషణం, క్రాంతికుమార్, హనుమంతరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుంతకల్లులో...

గుంతకల్లు టౌన్: పట్టణంలోని గోపాలకృష్ణ భవనంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని వాజ్‌పేయి 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, రామాంజనేయులు, విశ్వనాథ్, పురందర్, విజయలక్ష్మి, కొలమిశేకన్న, రంగన్న, దాసరి శ్రీనివాసులు, పద్మ, కేశవ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు, వితరణ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవరాజులు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశ సర్వతో ముఖాభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారని అన్నారు. జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేష్, నరసయ్య, బీజేపీ ఆదినారాయణ, చక్కా సుబ్రహ్మణ్యం, నరసింహ మూర్తి యాదవ్, రామకృష్ణ, సుధాకర్, సునీల్, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న అమిలినేని లక్ష్మీనారాయణ

కళ్యాణదుర్గం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణం, కంబదూరులోని చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయా చర్చిల్లో ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలు, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందచేత: పట్టణంలోని ప్రజావేదికలో బుధవారం రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లికి చెందిన వర్షిత అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్యం కోసం రూ.10 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు.

తాడిపత్రి అభివృద్ధే నా లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్



తాడిపత్రి, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): నా ప్రాణం ఉన్నంతవరకు తాడిపత్రి అభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. తాడిపత్రిని అధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కల్యాణమండపం శిథిలమైందన్నారు. ఆర్కియాలజీ అధికారులు బాలకృష్ణారెడ్డి, శివకుమార్, యోగి కల్యాణమండపాన్ని పరిశీలించారన్నారు. కల్యాణమండపం పునఃనిర్మాణానికి అధికారులు అనుమతి కూడా ఇచ్చారని తెలిపారు. వీరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. ఐదేళ్లక్రితం తనకు కొంచెం అహంభావం, ప్రిస్టేజీ ఉండడంతో మూల్యం చెల్లించుకున్నానన్నారు. ప్రస్తుతం ఎలాంటి పనిలేదని అభివృద్ధి పనులే ప్రధానమన్నారు. తాడిపత్రి ప్రజల కోసం నా అహం, ప్రిస్టేజీ పక్కనపెడతానని, వారికోసం ఎంతటికైనా తలవంచుతానని తెలిపారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు ఎవరికి భయపడనని నిస్వార్థంగా పనిచేస్తానన్నారు. ఆలయాలతోపాటు మసీదులు, చర్చీలను కూడా అభివృద్ధిచేస్తానని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కుందుర్పి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కల్పిస్తున్నారు. మండల పరిధిలోని అపిలేపల్లి గ్రామంలో ఏఎఫ్ ఎకాలజీ ప్రభుత్వ సహకారంతో ఐదు అంచుల పంటల సాగును 150 ఎకరాల్లో రైతు సహాయక సహకార సంఘం ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంట సాగులో ప్రకృతిలో లభించే ఆకులు, పశువుల పేడ ద్వారా మూడు సంవత్సరాలుగా పంటలు పండిస్తున్నారు. బుధవారం ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. సంస్థ సిబ్బంది ఓబుళపతి మౌనిక, తిప్పేస్వామి, అతావుల్లా, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీరాములు(55)అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని బండగేరికి చెందిన శ్రీరాములు 22వ తేదీన మన్రోసత్రం సమీపంలో ద్విచక్రవాహనం నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి శ్రీరాములు మృతి చెందాడన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మందికి గాయాలు

ఉరవకొండ,డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది గాయపడ్డారు. ఉరవకొండ మండలం, పట్టణశివారులో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. పట్టణశివారులోని అనంతపురం రహదారిలోని పెట్రోల్ బంకు వద్ద ఎదురెదుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఉరవకొండ పాతపేటకు చెందిన శంకర్, లక్ష్మి, వికాస్ గాయపడ్డారు. మరో వాహనంలో ఉన్న వినోద్‌కు గాయాలు అయ్యాయి. మండలంలోని లత్తవరం సమీపంలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. జరుట్లరాంపురం నుంచి ఉరవకొండకు వడ్ల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. కాంతప్ప, కార్తీక్ గాయపడ్డారు. వీరిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. విషయం తెలుసుకున్న సీఐ మహానంది ఆసుపత్రికి చేరుకుని ఘటన వివరాలను తెలుసుకున్నారు.

లారీ ఢీకొని వ్యాపారి...

బెళుగుప్ప: మండలంలో హనిమిరెడ్డిపల్లి సమీపంలో బుధవారం లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ప్లాస్టిక్ వ్యాపారి సద్దాం హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు బీహార్‌కు చెందిన ఇతను కళ్యాణదుర్గంలో నివాసముంటూ ప్లాస్టిక్ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రోజువారీ వ్యాపార నిమిత్తం పల్లెలకు బైకుపై వెళుతుండగా అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో బైకు నుజ్జునుజ్జు కావడంతో పాటు వ్యాపారికి రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు ఆయనను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైల్వేగేట్‌ను ఢీకొని యువకుడు...

తాడిపత్రి: మండలంలోని వెంకటాంపల్లి సమీపంలో శివకుమార్ అనే వ్యక్తి రైల్వేగేట్‌ను ద్విచక్రవాహనంతో రైల్వే గేటును ఢీకొనడంతో గాయపడినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన శివకుమార్ ద్విచక్రవాహనంపై యాడికికి వెళ్లి మద్యం తాగి తిరిగి వస్తుండగా వెంకటాంపల్లి వద్దకు రాగానే రైల్వేగేట్‌ను వేగంగా ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

క్రిస్మస్ పండుగ వేడుకలను బుధవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. అన్ని చర్చిలలో ఉదయం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ ఏసు క్రీస్తుచూపిన మార్గంలో నడవాలన్నారు. శత్రువులను కూడా ప్రేమించాలన్నదే ఏసుక్రీస్తు భావన అన్నారు. ఆయన చూపిన బాటలోనే మనమంతా నడవాలని కోరారు. ఏసుక్రీస్తు జన్మదిన జీవిత చరిత్రను, క్రిస్తు సందేశాన్ని భక్తులకు వివరించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



గుంతకల్లులో సిస్టర్ ప్రసంగం



తాడిపత్రిలో మాట్లాడుతున్న జేసీపీఆర్



గుంతకల్లు: ప్రార్థనల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు



కణేకల్లులో క్రైస్తవుల ర్యాలీ



కూడేరులో క్రైస్తవుల ప్రార్థనలు



ఉరవకొండలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



రాయదుర్గం రూరల్: ప్రార్థనలు చేస్తున్న పాస్టర్